సాక్షి
చిత్తూరు
గురువారం । 16 । జనవరి । 2025



గుట్ట..కొల్లగొట్టు
పుత్తూరు నడిబొడ్డున ఉన్న ఆరేటమ్మ గుట్టను టీడీపీ నేత చదును చేసి, ఆక్రమిస్తున్నారు. ఆ మట్టిని చెరువులో పోస్తున్నారు. - 8లో



పంటలపై గజదాడులు
బంగారుపాళెం మండలం బోడబండ్లలో పంటలపై ఏనుగులు దాడి చేసి, ధ్వంసం చేశాయి. - 8లో



సంక్రాంతి.. వెలుగులు నింపాలి
సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని మాజీ మంత్రి ఆర్కే రోజా ఆకాంక్షించారు. - 8లో

న్యూస్‌రీల్

ఆన్‌లైన్ చెల్లింపులు అలవాటు చేసుకోండి
చిత్తూరు కార్పొరేషన్: కరెంటు బిల్లును స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో చెల్లింపులను అలవాటు చేసుకోవాలని వినియోగదారులకు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. జనవరి నుంచి క్యూఆర్ కోడ్‌ను బిల్లు కింద ముద్రించి ఇస్తున్నామన్నారు. దాన్ని ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ఇతర యాప్స్ ద్వారా స్కాన్ చేసి, బిల్లులు చెల్లించవచ్చన్నారు. గతంలో యూపీఐ యాప్స్ ద్వారా నేరుగా చెల్లించేవారన్నారు. ప్రస్తుతం ఆ విధానం లేకపోవడంతో వినియోగదారుల సౌలభ్యం కోసం బిల్లులో క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసే కట్టేలా కొత్త విధానం ప్రవేశపెట్టారన్నారు. డివిజన్ పరిధిలో దాదాపు మొత్తం 1.90 లక్షల సర్వీసులు ఉన్నాయని చెప్పారు. వీటి ద్వారా నెలకు సుమారు రూ.11 కోట్ల నుంచి రూ.14 కోట్లు ఆదాయం వస్తోందన్నారు. గతంలో 20 శాతం వరకు ఆన్‌లైన్ ద్వారా బిల్లుల చెల్లింపులు చేసేవారన్నారు. ప్రస్తుతానికి ఈ నెలలో 35 శాతం వరకు చెల్లింపులు జరిగాయన్నారు. కార్యాలయాల వద్ద క్యూలో నిల్చుని బిల్లులు కట్టడం కన్న ఆన్‌లైన్ చెల్లింపులను వినియోగదారులు అలవాటు చేసుకోవాలన్నారు. వీటిపై ఏఈలు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

22న విద్యుత్ గ్రీవెన్స్
చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22వ తేదీన విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలోని వినియోగదారులు సమస్యలు తెలుపవచ్చన్నారు. సమస్యలను వినతిరూపంలో ఇవ్వాలని తెలిపారు.

వెండి కవచం సమర్పణ



వెండి కవచం అందజేస్తున్న దాత

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారికి ఓ దాత వెండి కవచం సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన సురేఖ అనే దాత 2 కిలోలు బరువు ఉన్న రూ.2.50 లక్షలు విలువ చేసే వెండి కవచం బుధవారం ఆలయాధికారులకు అందజేశారు. అనంతరం ఆమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'పాల్'
చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో పర్సనలైజెడ్ అడాప్టివ్ లెర్నింగ్(పాల్) కార్యక్రమం అమలు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విధి విధానాలపై డీఈఓ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు గణితం, ఇంగ్లిషు, తెలుగులో ఉన్న కంటెంట్‌తో పాల్ కార్యక్రమం అమలు చేయాలని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రంకెలేసిన పౌరుషం

సంక్రాంతి సంబరాల్లో భాగంగా చంద్రగిరి సమీపంలోని ఏ.రంగంపేట పరుష పందేలకు వేదిక అయ్యింది. విశేషంగా అలంకరించిన పశువులతో కనువిందు చేసింది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జల్లికట్టును వీక్షించేందుకు అశేష ప్రజానీకం తరలివచ్చింది. రంకెలేస్తూ దూసుకెళుతున్న కోడెగిత్తలను చూసి ఉత్సాహంతో కేరింతలు కొట్టింది. మిద్దెలు.. మేడలపై చేరి ఔత్సాహికులను ఈలలు.. చప్పట్లతో ప్రోత్సహించింది. ఈ క్రమంలో అశేష జనవాహిని చీల్చుకుంటూ పరుగులు తీస్తున్న ఎడ్లను నిలువరించేందుకు యువత బరిలో దూకింది. పశువులకు కట్టిన పలకలను చేజిక్కించుకునేందుకు పోటీ పడింది. గాయాలు తగులుతున్నా ఏమాత్రం వెరవకుండా లక్ష్యం సాధించి విజయగర్వంతో ఉప్పొంగింది.

చంద్రగిరి సమీపంలోని ఏ. రంగంపేటలో ఎడ్లను నిలువరించేందుకు పోటీ పడుతున్న యువకులు



- ఏ.రంగంపేటలో ఉత్సాహంగా పరుష పందేలు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు
- అశేష జనవాహిని నడుమ దూసుకెళ్లిన కోడెగిత్తలు
- నిలువరించేందుకు పోటీపడిన యువకులు
- పలువురికి స్వల్ప గాయాలు
- ప్రశాంతంగా పండుగ సంబరాలు

చంద్రగిరి : మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం భక్తిశ్రద్ధలతో పశువుల పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా పశువుల కొమ్ములకు రంగులు వేసి, నడుముకు నల్లరంగు ధారాలు, కాళ్లకు గజ్జెలు కట్టి ముస్తాబు చేశారు. ఆనవాయితీ ప్రకారం చేపట్టే పరుష పందేలకు సన్నద్ధం చేశారు.



రంకెలేస్తున్న కోడె గిత్త

ఎడ్ల కొమ్ములకు పలకలను కట్టారు. జిల్లాలోనే ఎడ్ల పందేల (జల్లికట్టు)కు పేరుపొందిన గ్రామం ఏ.రంగంపేట. ఈ క్రమంలో జల్లికట్టును వీక్షించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. గ్రామంలోని పశువులను ఒక్కసారిగా వీధిలోకి వదలడంతో యువకులు కేరింతలు కొడుతూ వాటిని నిలువరించేందుకు పోటీ పడ్డారు. ఆసక్తి కరంగా సాగిన ఎడ్ల పందేలను మహిళలు సైతం మేడలు, మిద్దెలు ఎక్కి ఆసక్తికరంగా తిలకించారు. పౌరుషంతో పరుగులు తీస్తున్న కోడెగిత్తలను అడ్డుకుని పలకలు దక్కించుకునేందుకు యువకులు ఉత్సాహం చూపారు. ఈ ప్రయత్నంలో పలువురు గాయాలపాలయ్యారు. సుమారు గంటన్నర పాటు ఉల్లాసంగా పరుష పందెం సాగింది. అయితే జల్లికట్టు నిర్వహణ చట్టవిరుద్ధమని చెబుతున్నా, ఎడ్ల పందేలు నిర్వహించారు. దీంతో తరతరాల సంప్రదాయాల ముందు చట్టాలు చిన్నబోయాయి. పోలీసులు సైతం పందేలను అడ్డుకోలేక, ప్రేక్షక పాత్ర పోషించారు.

మంచు మనోజ్ సందడి
ఏ.రంగంపేటలోని జల్లికట్టును సినీ నటుడు మంచు మనోజ్ వీక్షించారు. తన భార్య మౌనిక రెడ్డితో కలసి ఆయన పశువులు పరుగులు తీసే వీధిలోకి చేరుకున్నారు. అభిమానులకు అభివాదం చేస్తూ సుమారు గంట పాటు అక్కడే కాలక్షేపం చేశారు.

పలువురికి గాయాలు
పరుష పందేలను చూసేందుకు వచ్చిన వారిలో కొంత మంది యువకులు పశువులను పట్టుకునేందుకు యత్నించడంతో గాయాలపాలయ్యారు. ఎద్దును నిలువరించే క్రమంలో వాటి కొమ్ములు తగలడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన వారిని 108లో తిరుపతి రుయాకు తరలించారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల బాయ్‌కాట్



వైఎస్ జగన్ పలక చూపుతున్న అభిమానులు

తరతరాలుగా వస్తున్న సంప్రదాయ క్రీడను టీడీపీ నేతలు రాజకీయ వేదికగా మార్చేయడం చర్చనీయాంశమైంది. పరుష పందేల్లో ఎడ్లకు తమ అభిమాన నేతల ఫొటోలు, జెండాలు కట్టడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది ఏ.రంగంపేట జరిగిన జల్లికట్టులో వైఎస్సార్ సీపీ జెండాలు, నేతల చిత్రాలతో కూడిన ఫొటోలు ఏర్పాటు చేయకూడదంటూ టీడీపీ నేతలు అడ్డు తగిలారు. ఇది మంచి పద్ధతి కాదని, గత ప్రభుత్వ హయాంలోనూ అన్ని పార్టీలు కలసి ఈ వేడుకలను జరుపుకున్నాయంటూ స్థానిక పెద్దలు హితవు పలికినా, వారు పెడచెవిన పెట్టారు. ఇప్పుడు ఒకే పార్టీకి చెందిన జెండాలు, ఫొటోలు కడితే, భవిష్యత్‌లో ఇదే దుష్ట సంప్రదాయం అమలవుతుందని, అది మంచి కాదని నచ్చజెప్పేందుకు యత్నించినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎడ్ల పోటీలను బాయ్‌కాట్ చేశాయి. దీంతో పోటీలకు పశువులు పెద్దగా రాలేదు. కేవలం గంటన్నరలోనే పందేలు ముగిశాయి.



ఎద్దు కొమ్ములు వంచుతున్న యువత



పందేలను తిలకిస్తున్న మంచు మనోజ్ దంపతులు



పలకను పట్టే ప్రయత్నంలో యువకుడు



ఎద్దుకు కట్టిన పుష్ప పలక

మకరజ్యోతి దర్శనం.. భక్త జన పరవశం



తిరుఆభరణాలను ఊరేగింపుగా తీసుకు వస్తున్న పెద్దిరెడ్డి, చిత్రంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం మకరజ్యోతిని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. జ్యోతి దివ్యదర్శనం కాగానే అయ్యప్ప నామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మారుమోగాయి. అంతకు ముందు స్థానిక సదుమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి తిరు ఆభరణాలను ఉంచి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆభరణాలను తలపైకి ఎత్తుకుని కేరళ వాయిద్యాలు, ప్రత్యేక గొడుగుల నడుమ ఊరేగింపుగా తీసుకుని అయ్యప్ప సన్నిధానానికి చేరుకున్నారు. పడిమెట్ల మీదుగా వెళ్లి స్వామివారికి సమర్పించారు. తిరు ఆభరణాలు అలంకరించిన అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు నంబూద్రి నారాయణన్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయానికి తూర్పు దిక్కున ఉన్న కొండల్లో సాయంత్రం స్వామివారి మకరజ్యోతి దర్శనం ఇచ్చింది. జ్యోతి దర్శనం అనంతరం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణం అంతా కర్పూర జ్యోతులు వెలిగించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, కవితమ్మ, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, రేణుకమ్మ, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అభినయ్ రెడ్డి, నిహాంత్‌రెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, కొండవీటి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పోటెత్తిన భక్తులు
అయ్యప్ప ఆలయంలో మకరజ్యోతి దర్శనానికి భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఎర్రాతివారిపల్లెల జనసంద్రంగా మారింది. గంటల తరబడి వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో బయట ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన వివిధ రకాల పత్రాలు, పుష్పాలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. కళాకారుల ప్రదర్శనలు, చెక్కభజనలు, కోలాటాలు అలరించాయి.

ఎలాగైనా..
ఆడేందుకు.. అడ్డుకునేందుకు..

మాకు కూటమి నేతలు అండ ఉంది.. ఎలాగైనా మైలేరు నిర్వహిస్తామన్న ధీమాలో నిర్వాహకులు.. ఎస్పీ ఆదేశాలు పాటించాలి.. మైలేర్లు.. కోడి పందేలకు అడ్డుకట్ట వేయాలని పోలీసులు ఎవరికి వారు సిద్ధం అవుతున్నారు. అయితే పోలీసులకు కూటమి నేతలు అదుపు చేస్తున్నారు. సంప్రదాయం.. సంక్రాంతి సరదాలను కాదనడానికి మీరెవరన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మైలేర్లకు అడ్డుకట్ట పడేనా? లేదా సజావుగా సాగేనా అన్న మీమాంస ప్రజలలో నెలకొంది.

- జోరుగా జరగనున్న మైలేర్లు
- పోలీసు నిబంధనలు గాలికి..
- లక్కనపల్లిలో మైలేరు నిర్వహణపై కరపత్రాలు
- మైలేర్లకు అడ్డుకట్ట పడేనా?

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో మైలేర్ల జోరు సంక్రాంతి నుంచి మొదలైంది. ఏటా జనవరి నుంచి మూడు నెలల పాటు ఈ ప్రాంతంలో మైలేర్లు జరగడం పరిపాటి. దీంతోపాటు కోడిపందేలు సైతం ఇక్కడ ఈ సారి బహిరంగంగానే సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో మైలేర్లు, కోడి పందేలకు చాలా వరకు అడ్డుకట్ట పడింది. దొంగకు తేలు కుట్టిన చందంగా గుట్టుచప్పుడు కాకుండా అక్కడక్కడా చాలా పరిమితంగా మైలేర్లు నిర్వహించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మైలేర్ల నిర్వాహకులు పోలీసుల హెచ్చరికలు, నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. నాయకుల సిఫారస్సులతోనే ఆయా గ్రామాల్లో మైలేర్ల నిర్వహించేందుకు యువకులు సిద్ధమవుతున్నారు. జిల్లా ఎస్పీ మాత్రం సంక్రాంతి సందర్భంగా మైలేర్లు, కోడి పందేలు నిర్వహించకూడదని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మైలేర్లు, కోడిపందేలకు అడ్డుకట్ట పడేనా? లేక కూటమి నేతల అధికారంతో యథేచ్ఛగా సాగుతాయా? అన్న సందేహం నెలకొంది.

కూటమి నేతల సిఫార్సు
గత వైఎస్సార్‌సీపీ హయాంలో మైలేర్లపై నేతలు అభ్యంతరం తెలిపారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎలాంటి సమస్యలు లేకుండా మైలేర్లను నిర్వహించేలా కార్యకర్తల అభిప్రాయం మేరకు కూటమి నేతలు సిఫారస్సులు చేస్తున్నారు. అయితే మైలేర్లు నిర్వహించకుండా అడ్డుకట్ట వేయాలని పోలీసులకు జిల్లా ఎస్పీ ఇప్పటికే ఆదేశాలందాయి. దీంతో పోలీసుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది.

లక్కనపల్లిలో మైలేరు పైనే అందరి కన్ను
బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లిలో ఈనెల 19వ తేదీ మైలేరు నిర్వహించనున్నట్టు అక్కడి నిర్వాహకులు కరపత్రాలను ముద్రించి, మరీ పంపిణీ చేశారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.2 లక్షలు, ద్వితీయ, తృతీయ బహుమతులుగా బైక్‌లు ఇవ్వనున్నట్టు అందులో పేర్కొన్నారు. ఈ మైలేరిలో ఒక్కొక్క ఎద్దుకు టోకెన్‌గా రూ.2 వేలు చొప్పున చెల్లించాలి. కేవలం 350 ఎద్దులకు మాత్రమే ప్రవేశంగా అందులో పేర్కొన్నారు. కాగా ఆ గ్రామంలో ఎద్దులను తరిమేందుకు పెద్దగా సౌకర్యం లేదు. దీనికి తోడు అక్కడ టీడీపీ, వైఎస్సార్‌సీపీ పార్టీల మధ్య గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో చాలా సమస్యాత్మక గ్రామంలో మైలేరును ఎలా నిర్వహిస్తారనే ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇక్కడ పండుగ జరిగితే ఇబ్బందులు తప్పవని కొందరు జిల్లా ఎస్పీకి సైతం ఆకాశరామన్న ఉత్తరం ద్వారా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో పోలీసులు ఇక్కడ పండుగను నిర్వహిస్తారా? లేక రద్దు చేస్తారా? అనే సందిగ్ధం నెలకొంది.



ఎద్దు కొమ్ములు వంచేందుకు యత్నిస్తున్న యువకుడు (ఫైల్) (ఇన్‌సెట్) లక్కనపల్లిలో జరిగే మైలేరు కరపత్రం

ఈసారి కోడి పందేల జోరు



కత్తులు దూసుకుంటున్న కోళ్లు

మరోవైపు నియోజవర్గంలో నేతల అండదండలతో పలు గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. ఈ విషయమై స్థానిక డీఎస్పీ డేగల ప్రభాకర్‌ను వివరణ కోరగా సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి మైలేర్లు, కోడి పందేలను నిర్వహించకూడదని ఇప్పటికే గట్టిగా హెచ్చరించామన్నారు. ఎక్కడైనా ఏదైనా ప్రాణాలు పోతే నిర్వాహకులపై చర్యలు తప్పవన్నారు.

మైలేర్లకు 500 ఎద్దులు సిద్ధం
పండుగ నెల పెట్టినప్పటి నుంచి ఎద్దుకు మంచి మేత పెట్టడం, కొమ్ములు చివ్వడం చేస్తుంటారు. ఎడ్లను పరుగు పందేలకు తీసుకెళ్లే ముందు బాగా అలంకరిస్తారు. కొమ్ములకు రంగులు వేసి ప్రభలతో అలంకరించి, బెలూన్లు, గజ్జెలు కడతారు. ఇక పోటీల్లో ఎద్దులపై యువకులు దెబ్బ వేసేందుకు ప్రయత్నించకుండా దానికి రక్షణగా బ్లేడులు కట్టిన పరదాలను అమరుస్తారు. గిట్టలకు పసుపు పూసి, పూజ చేస్తారు. ఈ ప్రాంతంలో మైలేర్లకు వెళ్లే ఎద్దులు సుమారుగా 500 వరకు సిద్ధంగా ఉన్నాయి.

ప్రత్యేక శిక్షణ
నియోజకవర్గంలో మైలేరు పండుగను పలు గ్రామాల్లో గొప్పగా జరుపుకుంటారు. బైరెడ్డిపల్లె, బంగారుపాళెం, మండిపేట కోటూరు, చెత్తపెంట, కాబ్బల్లి, కెంచనబల్ల, రామకుప్పం, మిట్టూరు, శాంతిపురం, కెనమాకులపల్లె, మల్లానూరు, నాయినూరు, గొల్లచీమనపల్లె, తదితరాలున్నాయి. కేవలం మైలేర్లలో పరుగుపందెం కోసమే నిర్వాహకులు ఎద్దులను కొనుగోలు చేస్తుంటారు. పుంగనూరు జాతి రకం, లేదా దేశవాళీ జాతి ఎద్దులు చాలా బెరుకుగా ఉంటాయి. స్వతహాగా వీటికి పొడిచే లక్షణం ఎక్కువగా ఉంటుంది. అలాంటి వాటిని మైలేర్లలో వదలడానికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

విజేత వృషభం ధర రూ.10 లక్షలు
పోటీల్లో అడ్డంకులను ఛేదించుకుని తక్కువ సెకండ్లలో గమ్యం చేరిన ఎద్దు విజేతగా నిలుస్తుంది. మైలేరులో పాల్గొనే ఎద్దుకు ప్రవేశ రుసుముగా రూ.500 నుంచి రూ.వెయ్యి చెల్లించి, అట్ట తీసుకోవాలి. తక్కువ సెకనుల్లో నిర్ణీత ప్రదేశానికి వెళ్లే ఎద్దు మొదటి బహుమతిని కైవసం చేసుకున్నట్టే. మైలేర్లలో గెలుపొందిన ఎద్దుల ధర రూ.5 నుంచి రూ.10 లక్షలకు పైగా పలుకుతున్నాయి.

క్లుప్తంగా

పలమనేరు డీఎస్పీని కలిసిన ఎంపీ మిథున్ రెడ్డి



పలమనేరు డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఎంపీ మిథున్ రెడ్డి

పలమనేరు : పుంగనూరు అల్లర్ల కేసుకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బుధవారం పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్‌ను కలిశారు. ఆయన అల్లర్ల కేసులో బెయిల్ పొంది కోర్టు ఆదేశాల మేరకు నెలకోసారి ఇక్కడి డీఎస్పీ కార్యాలయంలో సంతకం చేస్తున్న విషయం తెలిసిందే. పలమనేరు వచ్చిన ఎంపీకి మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు రెడ్డెప్ప, జాఫర్, చెంగారెడ్డి, గణేష్‌యాదవ్, బాగారెడ్డి, దయానంద్ గౌడ, ముజ్జు, శశి తదితరులు స్వాగతం పలికారు.

సామాజిక బహిష్కరణపై ఫిర్యాదు

బైరెడ్డిపల్లె : మండలంలోని చిక్కనపల్లెకు చెందిన చంద్రప్ప కుటుంబ సభ్యులను సంక్రాంతి పండుగకు దూరం చేస్తూ గ్రామస్తులు సామాజిక బహిష్కరణ చేశారు. దీనిపై బాధితుడు మంగళవారం బైరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంక్రాంతి పండుగకు గ్రామంలో ప్రతి ఇంటి వద్ద చందాలు తీసుకుంటున్నారని, గత ఏడాది తమ కుమారుడు శ్రీకాంత్ కులాంతర వివాహం చేసుకున్నాడనే నెపంతో తమను పండుగకు దూరం చేస్తూ చందాలు తీసుకోకుండా సామాజిక బహిష్కరణ చేశారని పేర్కొన్నాడు. తమకు న్యాయం చేయాలని కోరాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాటరాయుళ్ల అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు: సంక్రాంతి సందర్భంగా పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బోడేవారిపల్లె వద్ద పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. దీంతో ఆ ప్రాంతంలో దాడులు చేసి, 8 మందిని అరెస్టు చేశారని, మరో ఇద్దరి పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. వారి నుంచి రూ.61 వేలు స్వాధీనం చేసుకుని, కేసు నమో దు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి మూల్యాంకనం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉన్నతాధికారులు తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మూల్యాంకనానికి సంబంధించిన కసరత్తు, పాటించాల్సిన నియమ, నిబంధనలను ప్రకటించారు. నియమాల ప్రకారం ముందస్తు కసరత్తును పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.

గుట్ట.. కొల్లగొట్టు

కబ్జాకు కాదేదీ అనర్హమన్నట్లు కూటమి నేతలు గుట్టలను సైతం కొల్లగొడుతున్నారు. అధికారంలో ఉన్నాం.. అడిగే వారు లేరు.. అడ్డురాలేరు.. కనిపించిందంతా కొల్లగొట్టేద్దాం అని గుట్టను సైతం చదును చేసి ఆక్రమించేస్తున్నారు. గుట్టను చదును చేసే క్రమంలో వచ్చే బండరాళ్లు.. మట్టిని చెరువులో కుమ్మరిస్తూ నీటి వనరునూ పూడ్చేస్తున్నారు. ఇదీ పుత్తూరు నడిబొడ్డున ఆరేటమ్మ గుడి వద్ద ఉన్న గుట్ట కబ్జా కథ.



ఆరేటమ్మ గుట్టను తొలిచేస్తున్న ఇటాచీ యంత్రం

దర్జాగా భూ కబ్జా!

- పుత్తూరు పట్టణ నడిబొడ్డున ఆక్రమణల పర్వం
- కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం
- రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం స్వాహాకు యత్నం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

పుత్తూరు: పట్టణ నడిబొడ్డున గల ఆరేటమ్మ గుట్టను స్థానిక తెలుగుదేశం పార్టీ నేత ఒకరు కాజేస్తున్నారు. పట్టపగలు ఇటాచీల సాయంతో కొండను తొలిచేస్తున్నా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పుత్తూరు రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 100లో ఆరేటమ్మ గుట్ట ఉంది. ఈ గుంటకు తూర్పు దిశగా ఆర్టీసీ కాలనీ, దక్షిణం వైపుగా బీసీ కాలనీలు ఉన్నాయి. పడమర వైపు కొన్ని నివాసాలు ఉన్నాయి. ఉత్తరం వైపుగా పుత్తూరు–చిత్తూరు రహదారికి అనుకుని ప్రభుత్వ పాఠశాలతోపాటు కొన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ నివాసాల మధ్య కొద్ది రోజులుగా యంత్రాల సాయంతో పెద్ద ఎత్తున చదును చేస్తున్నారు. ఇక్కడి నుంచి సేకరించిన మట్టిని, బండరాళ్లను సమీపంలోని పుత్తూరు చెరువులోకి తరలిస్తుండడంతో పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అడిగే వారే లేరా? అని ఆక్రోశిస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

పుత్తూరు పట్టణంలో జరుగుతున్న కబ్జాలపై విపక్ష వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. టీడీపీ నాయకులు అధికార గర్వంతో భూ కబ్జాలకు పాల్పడడం సిగ్గుచేటని విమర్శిస్తున్నారు. అధికారులు దీనిపై వెంటనే విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పండగ సెలవుల్లో మొదలైనట్టుంది



సంక్రాంతి పెద్ద పండుగ సెలవుల నేపథ్యంలో ఈ ఆక్రమణలకు పాల్పడినట్లున్నారు. ఆరేటమ్మ గుట్ట వద్ద భూకబ్జా విషయం తన దృష్టికి ఇప్పటి వరకు రాలేదు. వెంటనే సిబ్బందిని పంపి, ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తాం. విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకొంటాం.

– జీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

కూటమి రాకతో యథేచ్ఛగా ఆక్రమణలు



పుత్తూరు ఆరేటమ్మ గుట్టను చదును చేస్తున్న ఇటాచీ యంత్రం

గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భూ కబ్జాలకు, ఆక్రమణలు, అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడింది. అదే సమయంలో పుత్తూరు పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. దీంతో పట్టణంలోని భూములు, ఇళ్ల స్థలాల విలువ గణనీయంగా పెరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు దౌర్జన్యాలు, అవినీతి అక్రమాలకు మళ్లీ తెరతీశారు. పట్టణంలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. తమకు అడ్డు చెప్పేదెవరన్న ధీమాతో స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు.

జలాశయంలో శవమై తేలాడు!



మురుగన్(ఫైల్)

పెనుమూరు(కార్వేటి నగరం): అదృశ్యమైన యువకుడు ఎన్టీఆర్ జలాశయంలో శవమై తేలిన సంఘటన మంగళవారం కలవకుంట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కలవకుంట గ్రామానికి చెందిన శేఖర్ కుమారుడు మురుగన్(32) ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పెనుమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు అయ్యింది. అయితే మంగళవారం కలవకుంట గ్రామానికి సమీపంలోని ఎన్టీఆర్ జలాశయంలో ఓ మృతదేహం తేలుతున్నట్లు కొందరు గుర్తించి, స్థానికులకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, అగ్నిమాపక శాఖ సిబ్బందికి తెలిపారు. దీంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీశారు. తప్పిపోయిన మురుగన్ కుటుంబ సభ్యులను పిలిచి ఆ మృతదేహాన్ని చూపారు. దీంతో ఆ మృతదేహం తమ కుమారుడేనని వారు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా కొద్దిరోజులుగా మురుగన్ మానసిక పరిస్థితి సరిగా లేదని గ్రామస్తులు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

–8 కిలోల గంజాయి స్వాధీనం

వి.కోట: మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ఈ వివరాలను వెల్లడించారు. వి.కోట మండలంలోని ముదిమడుగు గ్రామానికి చెందిన లారీడ్రైవర్ పరంధామ మన్నెం జిల్లా నుంచి గంజాయి తరచూ తీసుకువచ్చి, బెంగళూరుకు చెందిన ఆంథోని, బైరెడ్డిపల్లెకు చెందిన చిరంజీవి, పలమనేరు నివాసి శివ, వి.కోట వాస్తవ్యుడు దావూద్ మరికొందరితో కలసి విక్రయిస్తుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు మంగళవారం పోలీసులు నిఘా పెట్టారు. వి.కోటలోని కేజీఎఫ్ రోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయం వెనుక పరంధామ,ఆంథోని, చిరంజీవి, శివ, దావూద్ కలిసి గంజాయి తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను విచారణ జరిపిగా పరంధామ ఇంటి సమీపంలో దాచి ఉంచిన మరో 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ ముఠాకు చెందిన మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిసింది. వారిని కూడా అతి త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు.



గంజాయి నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరులో నలుగురు..

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ జయరామయ్య కథనం మేరకు.. నగరంలో గంజాయి విక్రయాలపై ముందస్తు సమాచారం రావడంతో మంగళవారం మిట్టూరులోని పీజీఆర్ పోలీసు క్వార్టర్స్ సమీపంలో వన్‌టౌన్ పోలీసులు దాడులు చేశారు. ఇక్కడ గంజాయి విక్రయిస్తున్న అజారుద్దీన్, సయ్యద్ ఫజల్ మియా, ముబారక్ అలీ అనే నలుగురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి దాదాపు 2.5 కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండుకు ఆదేశించారు.

దళిత నేత దారుణ హత్య

- బండరాయితో తలపై మోది చంపిన వైనం
- వివాహేతర సంబంధమే కారణం
- మృతదేహంతో నిరసన



శివకుమార్(ఫైల్)

పలమనేరు: ముసలిమొడుగు గ్రామానికి చెందిన దళితనేత శివకుమార్‌ను పలమనేరుకు చెందిన షామీర్ అనే వ్యక్తి బండరాయితో మోది హత్య చేశాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి పట్టణ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వెనుక ఉన్న ఓ వెంచర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ముసలిమొడుగు గ్రామానికి చెందిన శివకుమార్(42) భార్య కొన్నాళ్లుగా పట్టణంలోని గుడియాత్తం రోడ్డులో ఉన్న చార్మినార్ హోటల్‌లో పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఆ దుకాణ యజమాని షామీర్‌తో శివకుమార్ భార్య వివాహేతర సంబంధం నడుపుతోంది. ఈ క్రమంలో వీరిద్దరూ కొన్ని రోజులు పారిపోయారు. దీనిపై తమిళనాడులోని వేలూరులో కేసు కూడా నమోదైంది. ఆపై ఇంటికొచ్చిన శివకుమార్ భార్యతో భర్త నచ్చజెప్పినట్టు తెలిసింది. ఇలా ఉండగా ప్రేమికులకు అడ్డంకిగా మారిన శివకుమార్‌ను తప్పించాలనే ఉద్దేశంతో షామీర్ పక్కాగా ప్లాన్ చేసి, శివకుమార్‌ను పిలిచి, ఇద్దరూ కలిసి హెచ్‌పీ పెట్రోల్ బంకు వెనుకనున్న వెంచర్‌లో మద్యం సేవించారు. ఆపై గొడవపడి శివకుమార్‌ను షామీర్ బండరాతితో మోది, చంపినట్టు పోలీసులు గుర్తించారు. ఈ హత్యకు అక్రమ సంబంధమే కారణమని సీఐ నరసింహరాజు విలేకరులకు తెలిపారు. ఇలా ఉండగా నిందితుడు పోలీసులు అదుపులో ఉన్నట్టు తెలిసింది. హతుడు శివకుమార్‌కు ఇద్దరు పిల్లలున్నారు.



శివకుమార్ మృతదేహంతో ధర్నా చేస్తున్న దళిత సంఘం నాయకులు, (ఇన్‌సెట్) దారుణ హత్యకు గురైన శివకుమార్

మృతదేహంతో ధర్నా

ఎస్సీ కులానికి చెందిన శివకుమార్ హత్యపై దళిత సంఘం నాయకులు మృతదేహంతో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం ధర్నా చేశారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా సీఐ మాట్లాడుతూ నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాణిపాకంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలో మంగళ, బుధవారాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవానికి శ్రీ విఘ్నేశ్వర యువజన సంఘం సభ్యులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. అలాగే కనుమ పండుగను పురస్కరించుకుని గోశాలలోని గోవులకు ఈఓ పెంచల కిషోర్ ప్రత్యేక పూజలు చేశారు.



గోపూజ చేస్తున్న ఈఓ పెంచల కిషోర్

జిల్లా సమగ్ర శిక్ష శాఖ ఏపీసీగా వెంకటరమణ



నూతన సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌గా మద్దిపట్ల వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఏపీసీగా ఉన్న వెంకటరమణారెడ్డి మాతృ శాఖ కో ఆపరేటివ్‌కు బదిలీ అయ్యారు. మద్దిపట్ల వెంకటరమణ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లి, నిమ్మనపల్లి మండలాల్లో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా, పుంగనూరు ఉర్దూ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్‌గా పని చేశారు. ఆ తర్వాత ఆయన గ్రూప్ 2 పరీక్షల్లో ఎంపికై కోఆపరేటివ్ శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం తిరుపతి కలెక్టరేట్‌లోని కో ఆపరేటివ్ శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. ఆయనను చిత్తూరు సమగ్ర శిక్ష శాఖ ఏపీసీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆయన ఈ వారంలో ఏపీసీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

వేణుగోపాలుడి పుర విహారం



ఊరేగుతున్న వేణుగోపాలుడు

కార్వేటినగరం : సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5.15 నుంచి 7.30 గంటల వరకు ఉభయ దేవేరులతో పాటు స్వామి వారిని ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్‌బాబు, టీటీడీ ఆలయాధికారి సురేష్‌కుమార్, అర్చకులు నారాయణ దాసరి, గోపాల ఆచారి పాల్గొన్నారు.



గోపూజ నిర్వహిస్తున్న వేద పండితులు

నాయిబ్రాహ్మణ బార్బర్ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్‌గా నిరన్‌కుమార్



నిరన్‌కుమార్

తవణంపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ ఆలయాల నాయిబ్రాహ్మణ బార్బర్ కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ(జేఏసీ) చిత్తూరు జిల్లా కన్వీనర్‌గా అరగొండకు చెందిన నిరన్‌కుమార్ ఎన్నికయ్యారు. నిరన్‌కుమార్ అర్ధగిరి వీరాంజనేయస్వామి దేవస్థానంలో కేశఖండన విధులు నిర్వహిస్తున్నారు. చిత్తూరు జిల్లా జేఏసీ కన్వీనర్‌గా ఎంపికైన నిరన్‌కుమార్‌ను పలువురు నాయిబ్రాహ్మణులు అభినందించారు.

కడప ఆర్జేడీగా శామ్యూల్



శామ్యూల్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు డీఈఓగా పనిచేసిన శామ్యూల్ ప్రస్తుతం కడప ఆర్జేడీగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన గతంలో చిత్తూరు, మదనపల్లి, తిరుపతి, పుత్తూరులో డీవైఈఓగా, చిత్తూరు డీఈఓగా పనిచేశారు. ఉద్యోగోన్నతుల్లో భాగంగా ఆయన ప్రస్తుతం పాఠశాల విద్య వైఎస్సార్ కడప జిల్లా రీజినల్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయనకు జిల్లాలోని పలువురు టీచర్లు శుభాకాంక్షలు తెలిపారు.

ఇరుముడి చెల్లించిన ఎమ్మెల్యేలు

సదుం: ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి, ద్వారకనాథరెడ్డి ఇరుముడులతో ఎర్రాతివారిపల్లెలోని అయ్యప్ప ఆలయానికి పడిమెట్ల మీదుగా చేరుకుని మొక్కులు చెల్లించారు. మాలధారణ చేసిన పలువురు స్వాములు ఇరుముడులు చెల్లించి, దీక్ష ముగించారు. ఆలయంలో అర్చకులు అభిషేకాలు చేసి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కాగా సంక్రాంతిని పురస్కరించుకుని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు వారిని కలిసి పండుగ శుభాకాంక్షలు చెప్పారు.

సంక్రాంతి..వెలుగులు నింపాలి



తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో కుటుంబసభ్యులు, బంధువులతో మాజీ మంత్రి ఆర్కేరోజా

– మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, కనుమ కమ్మనైన అనుభూతులు పంచాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా అన్నారు. మంగళవారం సంక్రాంతి పండుగ, బుధవారం కనుమ పండుగను ఆమె పట్టణంలోని తన స్వగృహంలో కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి వైభవంగా జరుపుకున్నారు. సంక్రాంతి పర్వదినం రోజు సింగిరికోన లక్ష్మీనరసింహస్వామి, తిరుత్తణి సుబ్రమణ్యస్వామిని కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి దర్శించుకున్నారు. ఇంటి వద్ద ప్రత్యేక పూజలు చేసి, సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సంప్రదాయాలకు నెలవన్నారు. ప్రకృతిలో వచ్చే మార్పులను పండగ విధులుగా చెప్పి వ్యక్తిగత, కుటుంబపరమైన, సామాజిక క్షేమాలను కలిగించేవిగా రూపొందించిన పండుగే పెద్దపండుగ అన్నారు. ఈ పండుగలు అందరిలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. గోమాతకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. గోమాతను పూజిస్తే దేవతలందరినీ పూజించినట్లేనని అన్నారు.

గాయపడిన యువకుడి మృతి

పెనుమూరు(కార్వేటినగరం): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. పెనుమూరు మండల కేంద్రానికి సమీపంలోని బీసీ కాలనీ వద్ద గత 8వ తేదీ ఓ ప్రైవేటు స్కూల్ వ్యాన్ ఢీ కొని, చార్వాగానిపల్లెకు చెందిన విష్ణు(30) గాయపడ్డాడు. క్షతగాత్రుడు తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బోడబండ్లలో పంటలపై గజదాడులు



ఏనుగులు విరిచి వేసిన అరటి, కొబ్బరి చెట్లు, మామిడి చెట్లు

బంగారుపాళెం: మండలంలోని బోడబండ్ల గ్రామంలో సోమవారం రాత్రి ఓ రైతుకు చెందిన పంట ఏనుగులు ధ్వంసం చేశాయి. బాధితుల కథనం మేరకు.. బోడబండ్ల పంచాయతీ పరిధిలోని పాన్నే పాళెం గ్రామానికి చెందిన రైతు కోదండ యాదవ్ పొలంలోకి ఏనుగులు వచ్చాయి. అరటి, కొబ్బరి, మామిడి చెట్లను విరిచేశాయి. వరి పంటను తొక్కేశాయి. పంటలపై ఏనుగులు వరుస దాడులు చేసి, ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కారు ఢీకొని స్కూటరిస్ట్ మృతి



సంఘటన స్థలంలో దెబ్బతిన్న కారు, స్కూటర్ (ఇన్‌సెట్) చంద్రశేఖర్ రాజు(ఫైల్)

వడమాలపేట (విజయపురం): స్కూటర్‌పై వెళుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన వడమాలపేట మండలంలోని కదిరిమంగళం మలుపు వద్ద బైపాస్ రోడ్ లో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వడమాలపేట మండలం జానావారి కొట్టాల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రాజు తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆయన కుటుంబం కొన్నేళ్లుగా తిరుపతిలో నివాసం ఉంటోంది. మంగళవారం సాయంత్రం తిరుపతి నుంచి స్కూటర్ పై స్వగ్రామమైన జానావారి కొట్టాల గ్రామానికి వస్తూ కదిరిమంగళం వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా పుత్తూరు నుంచి తిరుపతి వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ రాజు (57) అక్కడికక్కడే మృతి చెందాడు. వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారెడ్డి తెలిపారు.